స్థలంపై పెట్టుబడి పెడితే రెండింతల లాభం అంటూ మోసం

● జీఎస్‌ఆర్ ఇన్‌ఫ్రాపై కేసు

బంజారాహిల్స్, మే 23(ఆంధ్రజ్యోతి): ఫార్మ్ స్థలాల్లో పెట్టుబడి పెడితే రెండింతల లాభం ఇస్తామని నమ్మబలికి రూ. 1.20కోట్లు తీసుకొని తిరిగి చెల్లించే సమయంలో ముఖం చాటేసి తిరుగుతున్న జీఎస్‌ఆర్ ఇన్‌ఫ్రా ఎండీ గుంటుపల్లి శ్రీనివాసరావు, డైరెక్టర్ శిల్పపై పోలీసులు కేసు నమోదు చేశారు. నారాయణ్‌ఖేడ్‌లో ఫార్మ్ స్థలాల్లో పెట్టుబడి పెడితే రెండు సంవత్సరాల్లో రెండింతలు లాభం వస్తుందని జీఎస్‌ఆర్ ఇన్‌ఫ్రా ప్రచారం చేసింది. దీనికి ఆకర్షితులైన కూకట్‌పల్లికి చెందిన వి.పవన్‌కుమార్ కుటుంబ సభ్యులు 2022 సంవత్సరంలో రూ. 1.20కోట్లు పెట్టుబడి పెట్టారు. కంపెనీ డైరెక్టర్ శిల్పకు డబ్బు అందజేశారు. 2024లో రెట్టింపు డబ్బు డ్రా చేసుకునేలా కంపెనీ వారికి ఐదు చెక్కులు అందజేసింది. ఇటీవలే గడువు ముగియడంతో డబ్బు కోసం మాదాపూర్ కార్యాలయానికి వెళ్లగా ఆఫీస్ ఎత్తేశారు. జూబ్లీహిల్స్ కార్యాలయాన్ని సంప్రదించగా వారు స్పందించలేదు. మోసపోయినట్టు గ్రహించిన బాధిత కుటుంబం జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు జీఎస్‌ఆర్ ఇన్‌ఫ్రా ఎండీ గుంటుపల్లి శ్రీనివాసరావు, డైరెక్టర్ శిల్పపై సెక్షన్ 420 ఐపీసీ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఖాతాలో జమ చేస్తానని రూ. 35 వేలు కాజేశారు

బంజారాహిల్స్, మే 23(ఆంధ్రజ్యోతి): ఖాతాలో జమచేస్తానని రూ. 35వేలు తీసుకొని మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదైంది. కార్మికనగర్‌కు చెందిన రాజు కారు డ్రైవర్. ఈనెల 22న జూబ్లీహిల్స్ రోడ్డు నంబరు - 45లో ఉన్న ఎస్‌బీఐ బ్యాంక్‌కు రూ. 35 వేలు ఖాతాలో జమ చేసేందుకు వచ్చాడు. అక్కడే ఉన్న బ్యాంకు ఉద్యోగి ఏటీఎం కార్డు ఎక్స్‌పైరీ అయిందని చెప్పాడు. అక్కడే ఉన్న మరో వ్యక్తి డబ్బు తన ఖాతాలో వేసుకొని ట్రాన్స్‌ఫర్ చేస్తానని చెప్పాడు. నమ్మిన రాజు అతడికి డబ్బు ఇచ్చి పనికి వెళ్లిపోయాడు. కొద్ది సేపటికి బ్యాంకు ఖాతా చూసుకోగా డబ్బు జమ అయినట్టు కనిపించలేదు. వెంటనే బ్యాంక్ వద్దకు వెళ్లగా డబ్బు తీసుకున్న వ్యక్తి కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆన్‌లైన్ వ్యాపారం పేరుతో రూ. 92 వేలు కొట్టేశారు

బంజారాహిల్స్, మే 23(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో పెట్టుబడి పెడితే భారీగా లాభాలు వస్తాయని నమ్మబలికిన సైబర్ నేరగాళ్లు ఓ యువతి నుంచి రూ. 92 వేలు కొట్టేశారు. వెంకటగిరికి చెందిన శ్రీవల్లి (విద్యార్థిని)కి గతేడాది డిసెంబర్‌లో వాట్సప్‌లో ఆన్‌లైన్ వ్యాపారం పేరుతో ఓ లింక్ వచ్చింది. ఆ లింక్‌ను ఓపెన్ చేయగా వాట్సప్ గ్రూప్‌లోకి వెళ్లింది. రిజిస్ట్రేషన్ కింద రూ. 600 చెల్లించింది. నాలుగు నెలలపాటు గ్రూప్‌లో వస్తున్న వాటిని లైక్ చేయడం ద్వారా రూ.10వేలు ఆదాయం వచ్చింది. కొంత పెట్టుబడి పెడితే ఆదాయం పెరుగుతుందని సైబర్ నేరగాళ్లు చెప్పడంతో రూ. 92వేలు పెట్టుబడి పెట్టింది. కొద్ది రోజులకు వాటిని డ్రా చేసుకునేందుకు ప్రయత్నించగా సాధ్యం కాలేదు. మోసపోయిన్నట్టు గ్రహించిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాపీరైట్ చట్టాన్ని ఉల్లంఘిస్తూ పాటలు

● రెండు పబ్‌ల నిర్వాహకులపై కేసు

బంజారాహిల్స్, మే 23(ఆంధ్రజ్యోతి): కాపీ రైట్ చట్టాన్ని ఉల్లంఘిస్తూ పబ్‌లో సంగీతం, పాటలు పెడుతున్న నిర్వాహకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. బంజారాహిల్స్ రోడ్డు నంబరు - 1లో నివసించే బానోత్‌కార్తిక్ నాయక్ ఫోనోగ్రాఫిక్ పర్‌ఫామెన్స్ లిమిటెడ్ కంపెనీ (పీపీఎల్)లో సీనియర్ ఎగ్జిక్యూటివ్ లైసెన్సింగ్ అధికారిగా వ్యవహరిస్తున్నాడు. వివిధ బాషల్లో ఉన్న సినిమాల పాటలు, ప్రైవేట్ ఆల్బమ్స్ ఇలా సుమారు 45 లక్షల పాటలకు సంబంధించి కాపీ రైట్స్ వ్యవహారం ఈ పీపీఎల్ పర్యవేక్షిస్తూ ఉంటుంది. పీపీఎల్ నుంచి లైసెన్స్ తీసుకొని వారి ఆదీనంలో ఉన్న పాటలను పబ్‌లు, ఇతర పార్టీల్లో వాడాల్సి ఉంటుంది. జూబ్లీహిల్స్‌లో ఉన్న బాబీలాన్ కిచెన్, రెస్టారెంట్, అమ్నీషియా పబ్ నిర్వాహకులు ఎలాంటి లైసెన్స్ పొందకుండా ఇష్టానుసారంగా పాటలు, సంగీతాన్ని ఉపయోగిస్తున్నారు. ఇది గమనించి పీపీఎల్ సిబ్బంది గతేడాది సెప్టెంబర్ 5న రెండు పబ్‌ల నిర్వాహకులకు నోటీసులు జారీ చేసింది. స్పందన లేకపోవడంతో అదే నెల 15న లీగల్ నోటీసులు జారీ చేశారు. డిసెంబర్ 15, ఈ యేడాది జనవరి, ఫిబ్రవరిలో మరోసారి నోటీసులు జారీ చేశారు. కాని వారు పట్టించుకోలేదు. దీంతో కార్తిక్‌నాయక్ ఇది పీపీఎల్ కాపీరైట్స్ 36 చట్టాన్ని అతిక్రమించినట్టేనని పేర్కొంటూ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు బాబీలాన్ నిర్వాహకులు కుమార్‌లాల్, సుశీల్ అగస్టిన్, నీరజ్ మలానీ, మెరిన్‌బాబు, బింది యాజవార్‌తో పాటు అమ్నేషియా నిర్వాహకులు రాజశేఖర్ రామనాథ్ పురం, కునాల్‌కుక్రేజాపై సెక్షన్ 406,420 ఐపీసీ కాపీ యాక్ట్ 53,63,69 కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెద్ద శబ్దం చేస్తూ కారు నడిపిస్తున్న యువకులపై కేసు

బంజారాహిల్స్, మే 23(ఆంధ్రజ్యోతి): పెద్ద శబ్దాలు వచ్చే సైలెన్సర్‌తో కారు నడుతుపున్న యువకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈనెల 22న జూబ్లీహిల్స్ పోలీసులు బాబిలాన్ పబ్ వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. ఇదే సమయంలో ఓవ్యక్తి కారుతో పెద్ద శబ్దంచేస్తూ వస్తుండగా పోలీసులు ఆపి పరిశీలించి పెద్ద శబ్దాలు వచ్చేందుకు సైలెన్సర్ మాడిఫై చేసినట్టు తేలింది. కారు నడుపుతున్న మహ్మద్ అమీరుద్దీన్, కారులో ఉన్న మహ్మద్ ఫరాజ్, మొయిజుద్దీన్, అబ్దుల్ రహీంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని మహిళ మృతి

అమీర్‌పేట, మే 23(ఆంధ్రజ్యోతి): ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి ఎస్‌ఐ శ్రావణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... సనత్‌నగర్ స్వామి థియేటర్ సమీపంలో ఉన్న కల్లు కాంపౌండ్ సమీపంలో ఓమహిళ(40) అపస్మారక స్థితిలో పడి ఉన్నట్టు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న మహిళను పోలీసులు 108లో గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మహిళ మృతి చెందింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మహిళ మృతదేహం

మైనర్ కిడ్నాప్, పెళ్లి, యువకుడి అరెస్ట్

మంగళ్‌హట్, మే 23 (ఆంధ్రజ్యోతి): మైనర్ బాలికను కిడ్నాప్ చేసి పెళ్లి చేసుకున్న యువకుడిని సుల్తాన్‌బజార్ పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో ఏసీపీ శంకర్ వివరాలను వెల్లడించారు. నల్గొండ జిల్లాకు చెందిన హరికృష్ణ(30) ఈనెల 11వ తేదీన సుల్తాన్ బజార్ మెట్రో స్టేషన్ వద్ద ఓ బాలికకు మాయమాటలు చెప్పి కిడ్నాప్ చేసి విజయవాడకు తీసుకెళ్లాడు. అక్కడ హనుమాన్ మందిరంలో పెళ్లి చేసున్నాడు. అనంతరం లాడ్జికి తీసుకెళ్లి బాలికపై అత్యాచారం చేశాడు. బాలిక కనిపించకపోవడంతో తల్లిదండ్రులు సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు హరికృష్ణపై పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి జైలుకు తరలించారు. సుల్తాన్ బజార్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస చారి, ఎస్సైలు పాల్గొన్నారు.



వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ శంకర్

గంజాయి తీసుకెళ్తున్న ఇద్దరు వ్యక్తుల అరెస్టు

చందానగర్, మే 23 (ఆంధ్రజ్యోతి): గంజాయి తీసుకువెళ్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి 950 గ్రాముల గంజాయి, సెల్‌ఫోన్లను చందానగర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గుల్‌మొహర్‌పార్కు సమీపంలోని బాపునగర్‌లో నివాసం ఉండే సయ్యద్‌ఇమ్రాన్(23) పటాన్‌చెరు ఆర్‌సీపురంలో పాన్‌షాపు నడుపుతున్నాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా కందుకూరుకు చెందిన యనమల మహేష్(19) ఖైరతాబాద్‌లోని ఎల్లమ్మకాలనీలో నివాసం ఉంటున్నాడు. వీరిద్దరూ గుల్‌మొహర్‌చౌరస్తా నుంచి బ్యాగులో గంజాయి తీసుకుకెళ్తున్నారు. అక్కడే వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు వీరిని అదుపులోకి తీసుకుని బ్యాగులను చెక్‌చేయగా 950గ్రాముల గంజాయిని గుర్తించారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నత్తనడకన బాక్స్‌డ్రెయిన్ పనులు

● ముంచుకొస్తున్న వర్షాకాలం ● మైత్రివనం వెనుక ఇంకా కొనసాగుతున్న పనులు ● ఆందోళన చెందుతున్న బస్తీల వాసులు



మైత్రివనం వెనుక ఉన్న నాల



గాయత్రీనగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్ పక్కన వేసిన పూడిక

అమీర్‌పేట, మే 23(ఆంధ్రజ్యోతి): అమీర్‌పేట మైత్రివనం వెనకాల ఉన్న నాలాలో రూ. కోటిన్నరతో నిర్మించతలపెట్టిన బాక్స్ డ్రెయిన్ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. వర్షం వచ్చిన ప్రతిసారి నాలా ఉప్పొంగి గాయత్రీనగర్, గంగుబాయ్ బస్తీ బుద్ధనగర్‌లోని ఇళ్లల్లోకి, సెల్లార్లలోకి వరద నీరు చేరుతోంది. ఇది గమనించిన గత ప్రభుత్వం ఈ సమస్య శాశ్వత పరిష్కారానికి రూ. 1.50 కోట్లు కేటాయించి టెండర్లు పిలిచింది. ఆన్‌లైన్‌లో టెండర్ దక్కించుకున్న గుత్తేదారు మార్చి మొదటి వారంలో పనులు ప్రారంభించి ఇప్పటి వరకు కేవలం నాలాలోని పూడికను మాత్రమే తీశారు తప్ప.. బాక్స్ డ్రెయిన్ పనులు మాత్రం ప్రారంభించలేదు. వర్షాకాలం ముంచుకొస్తున్న నేపథ్యంలో పలు బస్తీల వాసులు ఆందోళన చెందుతున్నారు. స్వర్ణ జయంతి కాంప్లెక్స్ నుంచి ఆస్టర్ ప్రైమ్ ఆస్పత్రి వరకు విశాలంగా ఉండే నాలాను కొంతమంది ఆక్రమించి దీని నివాస గృహాలు, అపార్ట్‌మెంట్లను నిర్మించారు. భారీ వర్షం కురుస్తే శ్రీనివాసనగర్ (వెస్ట్)నుంచి భారీగా వచ్చే వర్షం నీరు తట్టుకునే సామర్థ్యం లేక ఉప్పొంగి వీధులు, కాలనీలు, బస్తీలను ముంచేస్తుతోంది. దీంతో ప్రతి వానాకాలం నాలా పరిసరాల్లో ఉన్న నివాసితుల ఇళ్లల్లోకి చేరిన నీటితో అష్టకష్టాలు పడుతున్నారు.

చిన్నపాటి వర్షానికే ఉప్పొంగుతున్న నాలా

స్వర్ణ జయంతి కాంప్లెక్స్ నుంచి లీలానగర్ వరకు ఉన్న ఒకటిన్నర కిలో మీటర్ల నాలాలో పూడిక పనులు కేవలం మైత్రివనం, గాయత్రినగర్ ప్రాంతాల్లో మాత్రమే చేపట్టారు. ఇందులో పేరుకుపోయిన చెత్తాచెదారంవల్ల చిన్నపాటి వర్షానికే నాలా ఉప్పొంగుతుంది. ఇటీవల మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పనుల పురోగతిని పరిశీలించి సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌ను మందలించినా ఫలితం లేకుండా పోయింది. ఉన్నతాధి కారులు స్పందించి సకాలంలో బిల్లులు చెల్లించి పనులను త్వరగా ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

వర్షం వస్తే జాగారమే



కొద్దిపాటి వర్షానికే నాలాలు పొంగి వీధుల్లోకి వరద నీరు చేరుతోంది. భారీ వర్షం కురిసిందంటే ఆ రోజు రాత్రంతా కుటుంబం మొత్తం కంటిమీద కునుకు లేకుండా జాగారణ చేస్తున్నాం. ఈ సమస్య ప్రతి వర్షాకాలంలో ఉంటోంది. గత సంవత్సరం కురిసిన భారీ వర్షాలకు మోకాలు లోతుకుపైగా నీరు గంటల తరబడి నిలవడంతో మా ద్విచక్ర వాహనాలు మునిగి పాడై పోయాయి. ఇకనైనా స్థానిక ఎమ్మెల్యే, జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు స్పంధించి నాలాల మరమ్మతు పనులు వేగంగా పూర్తి చేయాలి.

- శ్రీనివాస్ ముదిరాజ్, డ్రైవర్, బుద్ధనగర్

ఇంట్లోకి నీరు చేరుతోంది



ప్రతి వర్షాకాలంలో నాలా ఉప్పొంగి వరద నీరు ఇళ్లల్లోకి చేరుతోంది. దీంతో ఇంట్లో సామగ్రి తడిసిపోతున్నాయి. గత సంవత్సరం కురిసిన వర్షాలకు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నాం. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

- గోదారి లలితమ్మ, గంగుబాయ్ బస్తీ

వారం రోజుల్లో పనులు ప్రారంభం

మైత్రివనం వెనుకాల ఉన్న నాలాలో రూ.1.50 కోట్లతో నిర్మించ తలపెట్టిన బాక్స్ డ్రెయిన్ పనులను మరో వారం రోజుల్లో ప్రారంభిస్తాం. ఇప్పటికీ నాలాలో ఉన్న పూడికను తొలగించి జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్‌కు తరలిస్తున్నాం. ఇటీవల కురిసిన వర్షంవల్ల పనులు ఆగిపోయాయి. దీనికి తోడు నిధుల లేమితో కాంట్రాక్టర్ పనులు చేసేందుకు వెనకాడుతున్నాడు. త్వరలో పనులను పూర్తి చేయిస్తాం.

- యెతేంద్రమోహన్, డీఈ, జీహెచ్‌ఎంసీ, అమీర్‌పేట

ప్రమాదంలో స్మార్ట్ కార్డుల భద్రత

● నాసిరకం చైనీస్ చిప్‌తో జాతీయ భద్రతకు ముప్పు



మాట్లాడుతున్న రాహత్ చైర్మన్ డాక్టర్ కమల్ సోయి

పంజాగుట్ట, మే 23(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో సరఫరా చేస్తున్న స్మార్ట్ కార్డుల భద్రత ప్రమాదంలో ఉందని రాహత్ - ది సేఫ్ కమ్యూనిటీ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కమల్ సోయి ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం ఎర్రమంజిల్‌లోని హోటల్ మెర్క్యురీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... స్మార్ట్ కార్డ్ ఆపరేటింగ్ సిస్టమ్స్ ఫర్ ట్రాన్స్ పోర్ట్ అప్లికేషన్స్(ఎస్‌సీఓఎస్‌టీఏ) ప్రమాణాలకు అనుగుణంగా ఉందని ధ్రువీకరించడానికి, స్మార్ట్ కార్డ్ బ్యాచ్‌లపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కలర్ ప్లాస్ట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సరఫరా చేస్తున్న స్మార్ట్ కార్డులపై రాష్ట్ర రవాణా శాఖ మంత్రికి ఫిర్యాదు చేశామన్నారు. ఈ కార్డులు సరఫరా చేస్తున్న వారిని బ్లాక్ లిస్టులో పెట్టడంతో పాటు కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. పౌరుల డేటాను సురక్షితంగా భద్రపరచాలన్నారు. ప్రభుత్వ ఐడీ డేటాను చైనాకు అనధికారికంగా బదిలీ చేయడం ఆందోళన కలిగిస్తుందని, ఇది నిబంధనలను ఉల్లంఘించడమే కాకుండా జాతీయ భద్రతకు ముప్పు కలిగిస్తుందన్నారు. స్మార్ట్ కార్డ్‌లు హ్యాకింగ్, డేటా ఉల్లంఘనలు, అనధికారిక యాక్సెస్‌కు గురవుతాయని, స్మార్ట్ కార్డ్ సిస్టమ్‌లపై నమ్మకాన్ని దెబ్బతీస్తుందన్నారు. భారతదేశంలో రవాణా డేటా సమగ్రత, భద్రతను నిర్ధారించడానికి స్మార్ట్ కార్డ్ ఆపరేటింగ్ సిస్టమ్స్ ఫర్ ట్రాన్స్‌పోర్ట్ అప్లికేషన్స్- ఆమోదించిన చిప్‌లను సరఫరా చేయడం చాలా అవసరం అన్నారు. స్మార్ట్ కార్డ్‌ల నాణ్యత తనిఖీని ప్రభుత్వం చేపట్టాలని అన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బక్క జడ్సన్‌ను గెలిపించుకుంటాం



మాట్లాడుతున్న నిరుద్యోగ చైతన్య బస్సు యాత్రికులు

పంజాగుట్ట, మే 23(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులను నిండా ముంచిందని నిరుద్యోగ చైతన్య బస్సు యాత్ర సభ్యులు ఆరోపించారు. నిరుద్యోగుల పాలిట శత్రువు అయిన కాంగ్రెస్ పార్టీకి త్వరలో జరగనున్న వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బుద్ధి చెబుతామని వారు హెచ్చరించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బక్క జడ్సన్‌కు తమ పూర్తి మద్దతు ప్రకటించి గెలిపించుకుంటామని నిరుద్యోగ బస్సు యాత్రికులు ఏ.జనార్థన్ అన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సమావేశంలో యాత్ర సభ్యులు గోపాల్, యుగేందర్, శరత్‌తో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను నిండా ముంచిందని, తమ సమస్యలను శాసనమండలిలో లేవనెత్తి పరిష్కారమయ్యే వరకు పోరాడుతామన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు పౌరసమాజం, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై కనీస అవగాహన లేదన్నారు. నిరుద్యోగుల ఓట్లు చీల్చడానికే అశోక్ ఆన్‌లైన్ అకాడమీ నిర్వాహకుడు అశోక్ పోటీ చేస్తున్నారని, ఆయనను నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు.

సోషియాలజీలో కొత్త కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి



సోషియాలజీ కోర్సుల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బీమా

బర్కత్‌పుర, మే 23 (ఆంధ్రజ్యోతి): సోషియాలజీలో నూతనంగా ప్రవేశపెట్టిన కోర్సులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్. బీమా సూచించారు. గురువారం కళాశాలలో సోషియాలజీ కోర్సుల బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోషియాలజీలో కోర్సులను పూర్తిచేసిన విద్యార్థులు మెరుగైన ఉపాధి అవకాశాలు పొందవచ్చన్నారు. నిజాం కళాశాల సోషియాలజీ విభాగం ఇన్‌చార్జి హెడ్ డాక్టర్. డి. తిరుపతి మాట్లాడుతూ బీఏ సోషియాలజీలో (హెచ్‌ఎస్‌జీ, పీఎస్‌పీ, పీఎస్‌ఎం, ఎస్‌యూపీ) నాలుగు గ్రూప్‌లతో నూతన కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎంఏ సోషియాలజీలో పీజీ డిప్లొమా ఇన్ క్రిమినాలజీ అండ్ కరక్షనల్ అడ్మినిస్ట్రేషన్, పీజీ డిప్లొమా ఇన్ డెవలప్‌మెంట్ మేనేజ్‌మెంట్ అండ్ రీసెర్చ్ మెథడాలజీ, హ్యూమన్ రైట్స్ అండ్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కోర్సులను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచే విద్యార్థులు నూతన కోర్సులలో చేరవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్. పి.మాలతి, డాక్టర్. సీహెచ్. పరంధాములు, స్టూడెంట్ అడ్వయిజర్ మహ్మద్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

రాజ్‌భవన్ పాఠశాలలో పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్



పనులను పర్యవేక్షించేందుకు వచ్చిన జిల్లా అదనపు కలెక్టర్ కధీరవన్ పలాని

ఖైరతాబాద్, మే 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, మంచి వాతావరణం కల్పించేందు కు ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలతో చేపడుతున్న పనులను జిల్లా అదనపు కలెక్టర్ కధీరవన్ పలాని పర్యవేక్షించారు. గురువారం ఆయన రాజ్‌భవన్ ప్రభుత్వ పాఠశాల వద్ద కొనసాగుతున్న పనులను పరిశీలించి ప్రాథ మిక, ఉన్నత పాఠశాలల ప్రిన్సిపాళ్లతో మాట్లాడి పలు సూచనలు ఇచ్చారు. ఈ పాఠశాలల్లో విద్యుత్, ప్లంబింగ్, బాత్ రూంలకు మరమ్మతు పనులు జరుగుతున్నాయి. వీటిని నాణ్యతతో చేపట్టాలని ఆయన సిబ్బందికి సూచించారు. ఏరియా లెవెల్ ఫెడరేషన్ల ద్వారా ఈ పనులు జరగడంవల్ల పిల్లలకు ఉపయుక్తంగా ఉంటాయన్నారు. ఇందులో రాజ్‌భవన్ ఉన్నత పాఠశాల ప్రిన్సిపల్ గోపాల్, ప్రాథమిక పాఠశాల ప్రిన్సిపల్ పుష్పలత, ఏఎల్‌ఎఫ్ సుజాత తదితరులు ఉన్నారు.

భార్యతో గొడవలు.. అనారోగ్యం జీవితంపై విరక్తితో ఓ వ్యక్తి బలవన్మరణం

అల్వాల్, మే 23 (ఆంధ్రజ్యోతి): దంపతుల మధ్య గొడవలు.. అనారోగ్యంతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. అల్వాల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇందిరానగర్ కానాజీగూడ ప్రాంతానికి చెందిన పల్లె ప్రమోద్‌కుమార్(40) తల్లితో కలిసి నివసిస్తున్నాడు. భార్య సౌజన్యతో కొన్ని సంవత్సరాలుగా మనస్పర్థల కారణంగా ఇద్దరి మధ్య తరుచుగా గొడవలు జరుగుతున్నాయి. దీంతో విడాకుల కోసం కోర్టును ఆశ్రయించారు. దీంతో ప్రమోద్‌కుమార్ మానసికంగా కుంగిపోయాడు. దానికి తోడు అనారోగ్యానికి గురవడంతో జీవితంపై విరక్తి చెందాడు. బుధవారం రాత్రి తల్లితో కలిసి భోజనం చేసి, తన రూమ్‌లోకి వెళ్లి నిద్రపోయాడు. గురువారం ఉదయం 7 గంటలకు నల్లా నీళ్లు పడదామని తల్లి ప్రమోద్ కుమార్‌ను పిలవగా పలకలేదు. రూమ్‌లోకి వెళ్లి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకుని వేలాడుతూ ఉన్నాడు. ఆమె వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మాదాపూర్, మే 23(ఆంధ్రజ్యోతి): గాయత్రినగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణాలవల్ల శుక్రవారం ఉదయం 11.30 నుంచి ఒకటి గంట వరకు గాయత్రినగర్ పార్కు, హరిహర టెంపుల్, పద్మావతి హోటల్‌లో విద్యుత్ ఉండదని అధికారులు తెలిపారు. మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు హనుమాన్‌టెంపుల్, స్వాతిస్కూల్, యూనియన్ బ్యాంక్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

నేడు మెగా ఉచిత వైద్య శిబిరం

ఎర్రగడ్డ, మే 23(ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డ సుల్తాన్ నగర్‌లో వరల్డ్ యునైటెడ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు కౌన్సిల్ సభ్యులు సంజయ్ నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సయ్యద్ రసూల్ తెలిపారు. ఎర్రగడ్డలోని సుల్తాన్ నగర్ షంషీర్ ఫంక్షన్ హాల్లో శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఉచిత వైద్య శిబిరంలో మెగా కంటి వైద్య శిబిరంతో పాటు డెంటల్, స్కిన్, హార్ట్ తదితర సాధారణ ఉచిత పరీక్షలు కూడా నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. సనత్ నగర్ లైన్స్ క్లబ్ సహకారంతో బాలానగర్ లైన్స్ కంటి ఆస్పత్రి వారు వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు.

విద్యాదానం ఉన్నతులుగా నిలబెడుతుంది



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జనార్ధనమూర్తి, శంకరనారాయణ

చిక్కడపల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి): కళా విద్యాదానం ఉన్నతులుగా నిలబెడుతుందని, జీవితాలను కాపాడుతుందని ప్రముఖ జర్నలిస్ట్, హాస్యావధాని శంకరనారాయణ అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో గురువారం రాత్రి రచయిత అంజన గోలి(అమెరికా) రచించిన బెటర్ ట్రాజెక్టరీస్ ఆంగ్ల వ్యాస సంపుటి గ్రంథావిష్కరణ కళాసుబ్బారావు కళావేదికలో జరిగింది. ముఖ్య అతిథిగా గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శంకరనారాయణ మాట్లాడుతూ అంజన గోలి అమెరికాలో స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయంలో విద్య అభ్యసిస్తూ పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ వ్యక్తిత్వ వికాస వ్యాస రచనతో సాహితీసేద్యం చేస్తున్నారని ప్రశంసించారు. ఏడు విభాగాలలో నేటి యువతరానికి మార్గనిర్దేశనం చేసే అంశాలు అంజన ఈ పుస్తకంలో ప్రస్తావించారని వివరించారు. జనార్ధనమూర్తి మాట్లాడుతూ అంజన గోలి సోదరితో కలిసి గానసభలో చిన్ననాడు గీతా శ్లోకాలు ఆలపించిన విషయం గుర్తు చేశారు. ప్రముఖ జర్నలిస్ట్ ఎల్లాప్రగడ మల్లికార్జునరావు సంపుటిని విశ్లేషణ చేస్తూ మానవ జీవితం సన్మార్గంలో నడవడానికి దానం ధర్మగుణం అవసరమని వాటిగురించి అంజన వివరించారని తెలిపారు. మంచి సమాజ నిర్మాణం కోసం ఉత్తమ సాహిత్యం అవసరమన్నారు. సాహితీవేత్త విశ్వేశ్వరరావు సంపుటిలోని అధ్యాయాలను పరిచయం చేశారు.

అన్నమయ్య పదానికి పర్యాయ పదంగా నిలుస్తోన్న వెంకట్ : కేవీ రమణాచారి



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న రమణాచారి, మామిడి హరికృష్ణ తదితరులు

రవీంద్రభారతి, మే 23(ఆంధ్రజ్యోతి): తాళ్లపాక పద సాహిత్యానికి వెంకట్ గరికపాటి చేస్తున్న సేవలు అద్వితీయమని, తెలుగు సాహితీ వనంలో వెంకట్ గరికపాటి వ్యాఖ్యాన గ్రంథాలు చిరకాలం పారిజాతాలై పరిమళిస్తాయని రిటైర్డ్ ఐఏఎస్ కేవీ.రమణాచారి అన్నారు. గురువారం రవీంద్రభారతిలో శ్రీరామ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో తాళ్లపాక అన్నమయ్య 616వ జయంతి మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రమణాచారి కళాకారులను సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా వెంకట్ గరికపాటి వ్యాఖ్యానం, విశ్లేషణ చేసిన మాధవ పదమయూఖ, శ్రీసామీరి సంకీర్తన సమీరం పుస్తకాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒక పుస్తకం రాయడమే ఘనమని భావించే ఈ రోజుల్లో 22 పుస్తకాలకు వెంకట్ గరికపాటి కృతి కర్త కావడం అభినందనీయమన్నారు. అన్నమయ్య అనే పదానికి పర్యాయ పదంగా వెంకట్ నిలుస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త సుధామ, ప్రకాష్ చంద్రబరోడ్, మామిడి హరికృష్ణ, చంద్రశేఖర్ గొర్తి తదిరతులు పాల్గొన్నారు. సభకు ముందు ప్రదర్శించిన శ్రీరామాంజనేయ రమ్యగీతిక (వ్యాఖ్యాన సహిత గాత్రగోష్ఠి) కార్యక్రమం ప్రేక్షకుల్ని సమ్మోహన పరిచింది. ద్విజావంతి రాగంలో రామచంద్రుడితడు రఘువీరుడు అనే సంకీర్తనతో ప్రారంభమైన ఈ గాత్రగోష్ఠి మొక్కరో మొక్కరో వాడే, దేవదేవం భజే దివ్యప్రభావం, పెగిరినాడు చూడరో పెద్ద హనుమంతుడు, సీతపడుసు వంటి సంకీర్తనలకు వ్యాఖ్యాన గాత్రగోష్ఠి నిర్వహించారు. తమదైన శైలిలో వెంకట్ గరికపాటి వ్యాఖ్యానం, రామాచారి గానం చేసి శ్రోతల్ని మైమరిపించారు.

సాహితీ చంద్రిక గ్రంథావిష్కరణ

రవీంద్రభారతి, మే 23 (ఆంధ్రజ్యోతి): సమకాలీన సమాజ దృక్కోణాన్ని రచయిత్రి విజయలక్ష్మి చక్కగా ఆవిష్కరించారని రిటైర్డ్ ఐఏఎస్ రమణాచారి అన్నారు. గురువారం రవీంద్రభారతిలో తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ సహకారంతో సాహితీ జగీష సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో డా.పులిగడ్డ విజయలక్ష్మి రచించిన సాహితీ చంద్రిక గ్రంథావిష్కరణ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన రమణాచారి పుస్తకాన్ని ఆవిష్కరించి రచయిత్రిని అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాహితీ చంద్రిక పుస్తకం ఆనంద చంద్రిక, అక్షర చంద్రిక వంటిదని అభివర్ణించారు. విజయలక్ష్మి వ్యాసాలలో 'అదితి, ద్రౌపది, ఆగస్త్యుడు వంటి పురాణ పాత్రలపైన మాత్రమే కాక వృద్ధాప్యం ఒక శాపమా' వంటి ప్రత్యేక వ్యాసాలు ఆమెలోని ఆధ్యాత్మిక, ఆస్తిక భావాలని తెలియజేస్తోందని అన్నారు. విజయలక్ష్మి నిరంతర అధ్యయనశీలి అని కొనియాడారు. కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, ఎం.దత్తాత్రేయశర్మ, ఆచార్య వెలుదండ నిత్యానందరావు, ఆచార్య టి.గౌరీశంకర్, శంకరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ విజయ్‌మోహన్‌కు కామధేను అవార్డు

బర్కత్‌పుర, మే 23(ఆంధ్రజ్యోతి): బర్కత్‌పురకు చెందిన డాక్టర్ ఎస్. విజయ్‌మోహన్‌కు డాక్టర్ కాకర్ల సుబ్బారావు మెమోరియల్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ కామధేను అవార్డును అందుకున్నారు. వంశీ ఇంటర్నేషనల్ సోషియో కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ సినీ నటుడు మురళీమోహన్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నట్లు గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వెల్లడించారు. డాక్టర్‌గా రోగులకు అందిస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేయడం సంతోషంగా ఉందన్నారు. పేదలకు మరిన్ని వైద్య సేవలందిస్తానని ఆయన తెలిపారు.

ఆరు నెలలుగా నల్లాల ద్వారా మురుగునీరు

● ఫిర్యాదు చేసినా పట్టించుకోని జలమండలి అధికారులు

● ఆజాద్‌నగర్ బస్తీ వాసుల ఆవేదన



నల్లా ద్వారా సరఫరా అయిన మురుగునీరు

అడ్డగుట్ట, మే 23 (ఆంధ్రజ్యోతి): ఆజాద్ చంద్రశేఖర్‌నగర్ బస్తీలో ఆరు నెలలుగా తాగునీటి నల్లాల ద్వారా మురుగునీరు వస్తోందని బస్తీ వాసులు వాపోయారు. జలమండలి మారేడుపల్లి ఏఈకి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటున్నారు. నల్లాల ద్వారా మురుగునీరు రావడంతో తాగునీరు కొనుక్కుంటున్నామంటున్నారు. కలుషిత నీరు తాగడం వల్ల పిల్లలు అనారోగ్యం బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పైపులైన్‌కు మరమ్మతులు చేయాలని, మురుగునీరు సరఫరా కాకుండా చర్యలు తీసుకోకపోతే జలమండలి మారేడుపల్లి కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని బస్తీవాసులు హెచ్చరిస్తున్నారు.

రైళ్లపై రాళ్లతో దాడి చేస్తే కఠిన చర్యలు

● ఆర్పీఎఫ్ ఎస్‌ఐ నసీమా



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఆర్పీఎఫ్ బేగంపేట ఎస్‌ఐ నసీమా

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, మే 23 (ఆంధ్రజ్యోతి): రైళ్లపై రాళ్లతో దాడి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్పీఎఫ్ బేగంపేట సబ్ ఇన్‌స్పెక్టర్ నసీమా హెచ్చరించారు. గురువారం బేగంపేట్ రైల్వే స్టేషన్ ప్రాంతంలో పట్టాల సమీపంలో ఉన్న బస్తీల్లో ప్రజలకు ఆర్పీఎఫ్ కానిస్టేబుళ్లు అవగాహన కల్పించారు. కరపత్రాలు, పోస్టర్ల ద్వారా బస్తీలో ప్రచారం చేశారు. నడుస్తున్న రైళ్లపై రాళ్లతో దాడి చేసిన వారిపై రైల్వే యాక్ట్ ప్రకారం శిక్షలు తప్పవన్నారు. ఎవరైనా రైళ్లపై దాడి చేస్తే 7093992750 నంబర్‌కు ఫోన్ చేయాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు.

నేటి నుంచి కంచి పరమాచార్య జయంతి వేడుకలు

చిలకలగూడ, మే 23 (ఆంధ్రజ్యోతి): మారేడుపల్లి, కృష్ణనగర్‌కాలనీ, కళాసాగరంలో కంచి పరమాచార్య చంద్రశేఖరేంద్ర స్వామి 130వ జయంతి వేడుకలు మూడు రోజులు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశామని చంద్రశేఖరేంద్ర సంగీత ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి ఎస్. చంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం సాయంత్రం 7.30 గంటలకు వై.రమాప్రభ బృందంచే అయోధ్య రామ ఆనందరామ నృత్యరూపకం, శనివారం సాయంత్రం 6.30 గంటలకు హరికథా చూడామణి, యం.వి. సింహాచల శాస్త్రిచే హనుమత్ సందేశం హరికథ, ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు మందా అనంతకృష్ణ వేణగాన కచేరీ, అనంతరం రంగనాథ అయ్యర్ గాత్ర కచేరీ జరుగుతుందని చంద్రశేఖర్ పేర్కొన్నారు.



బౌద్ధనగర్‌లో బుద్ధ దేవాలయంలో ప్రార్థనలు చేస్తున్న త్రిరత్న బౌద్ధ మహాసంఘ్ సభ్యులు

బుద్ధుడి ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు

బౌద్ధనగర్, మే 23 (ఆంధ్రజ్యోతి): జట్వన్ బుద్ధ విహార్(బుద్ధుని ఆలయం)లో గురువారం బుద్ధ జయంతి నిర్వహించారు. త్రిరత్న బౌద్ధ మహాసంఘ్ హైదరాబాద్ బ్రాంచ్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బుద్ధుడి విగ్రహం వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బ్రహ్మచారి బుద్ధరుచి, సంఘసిద్ధలు భక్తులకు సందేశం ఇచ్చారు. ఆలయ అభివృద్ధికి టి.మనోహర స్వామి, ఎ.యాదగిరి సహకారం అందించారని బుద్ధరుచి తెలిపారు.

అన్నదానం



పౌర్ణమి సందర్భంగా బొల్లారం డౌటన్ బజార్‌లో భూలక్ష్మమ్మ దేవాలయంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి నరసింహన్, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అరవింద్ ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. - తిరుమలగిరి, ఆంధ్రజ్యోతి

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి

మల్కాజిగిరి, మే 23 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. సీతాఫల్‌మండి రవీంద్రనగర్ ప్రాంతానికి చెందిన బియ్యాల భాస్కర్ (44) గురువారం మల్కాజిగిరి కృష్ణసాయినగర్‌లో రమణ అనే వ్యక్తికి చెందిన కొత్త ఇంట్లో ఏసీ ఫిట్టింగ్ ఫిట్ చేస్తున్నాడు. డ్రిల్లింగ్ మిషన్‌తో హోల్స్ పెడుతుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో కిందపడిపోయాడు. వెంటనే ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మల్కాజిగిరి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శిథిలావస్థలో రక్షక భట నిలయం

● ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి


● బీటలు వారిన గోడలు, పెచ్చులూడుతున్న పై కప్పు

● వర్షం వస్తే చిలకలగూడ పోలీస్‌స్టేషన్‌లోకి నీరు

● భయంతో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది



చిలకలగూడ పోలీస్‌స్టేషన్ భవనం



బీటలు వారిన గోడలు



గ్రౌండ్ ఫ్లోర్‌లో దెబ్బతిన్న పిల్లర్

బౌద్ధనగర్, మే 23 (ఆంధ్రజ్యోతి): చిలకలగూడ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాలంటే అధికారులు, సిబ్బందితోపాటు ప్రజలు భయపడుతున్నారు. శిథిలావస్థకు చేరిన భవనం ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. వర్షం కురిస్తే బీటలు వారిన స్లాబు ద్వారా వర్షపు నీరు లోపలికి చేరుతుంది. పోలీస్ స్టేషన్ భవనం శిథిలావస్థకు చేరిందని అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా, పత్రికల్లో కథనాలు వచ్చినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో అధికారులు, సిబ్బంది భయంతో విధులు నిర్వహిస్తున్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో పలు పిల్లర్లు దెబ్బతిని ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. భవనంలో చాలాచోట్ల పెచ్చులూడి, గోడలు బీటలు వారాయి. ప్రజలకు రక్షణ కల్పించే తమకే రక్షణ లేకుండా పోయిందని, పోలీస్‌స్టేషన్ కూలి ప్రాణాలు పోతే కుటుంబాలు రోడున పడతాయని కిందిస్థాయి సిబ్బంది వాపోతున్నారు. భవనం శిథిలావస్థకు చేరిందని, ఖాళీ చేయాలని జీహెచ్ఎంసీ అధికారులు పలుమార్లు నోటీసులు జారీ చేశారు. పోలీస్ స్టేషన్ భవనాన్ని మరోచోటికి తరలించాలని పలువురు కోరుతున్నారు.

ఈస్ట్‌జోన్ పరిధిలో పెద్ద పోలీస్‌స్టేషన్

హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో అతిపెద్ద పోలీస్‌స్టేషన్ చిలకలగూడ. ఈ స్టేషన్ పరిధిలో సుమారులు నాలుగున్నర లక్షల మంది జనాబా ఉంది. స్టేషన్‌ను ఈస్ట్‌జోన్ పరిధిలోకి తీసుకువచ్చారు. జూన్ రెండో తేదీన పోలీస్‌స్టేషన్‌ను విడదీస్తూ వారాసిగూడ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేశారు. ప్రసుత్తం చిలకలగూడ పోలీస్‌స్టేషన్‌లో స్టేషన్ హౌస్ ఆఫీసర్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌తో పాటు ఐదుగురు సబ్ ఇన్‌స్పెక్టర్లు, సుమారు 70 సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో పార్కింగ్ ఏర్పాటు చేయగా, మొదటి అంతస్తులో స్టేషన్ హౌస్ ఆఫీసర్, ఎస్‌ఐలు, ఇతర సిబ్బంది పనిచేస్తున్నారు. రెండో అంతస్తులో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌తోపాటు డీఎస్‌ఐ క్రైమ్ విభాగం, విశ్రాంతి గదులున్నాయి. ప్రతిరోజూ స్టేషన్‌కు వచ్చేవారి సంఖ్య వందల్లో ఉంటుంది.

నాలా పక్కన స్టేషన్ భవనం

పూడుకుపోయిన చెరువు స్థలంతోపాటు నాలా పక్కన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ నిర్మించడంతో శిథిలావస్థకు చేరిందని నిపుణులు ఆరోపిస్తున్నారు. 1998-99వ సంవత్సరంలో చిలకలగూడ మైదానంలో కొంతస్థలాన్ని కేటాయించి రెండు అంతస్తుల్లో స్టేషన్ భవనాన్ని నిర్మించారు. ఆ స్థలం పూడ్చివేసిన చెరువుది కావటంతోపాటు ఓపెన్ నాలా పక్కనే భవనాన్ని నిర్మించారు. భవనం నిర్మించేటప్పుడు మట్టిపరీక్షలు వంటివి చేయకపోవటం, నిబంధనలను పరిగణనలోకి తీసుకోకపోవటమే కారణమని నిర్మాణరంగ నిపుణులు ఆరోపిస్తున్నారు. నాలాలో పారే మురుగునీటితో పాటు, భూమిలో నుండి వచ్చే కాలుష్యం కారణంగా పునాదులు దెబ్బతింటున్నాయని వారు తెలిపారు. జీహెచ్ఎంసీ పురాతన భవనాలను పరిశీలించిన జాబితాలో చిలకలగూడ పోలీస్‌స్టేషన్ భవనాన్ని చేర్చినట్లు సమాచారం.

స్టేషన్‌ను మరో ప్రాంతానికి తరలించాలి



చిలకలగూడ పోలీస్ స్టేషన్‌ను మరో ప్రాంతానికి తరలించాలి. శిథిలావస్థకు చేరిన భవనం ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. ఫిర్యాదులు చేయడానికి స్టేషన్‌కు వెళ్తున్న వారు భయపడుతున్నారు.

- గుంటి కృష్ణ, చిలకలగూడ

భవనాన్ని చూస్తుంటే భయమేస్తుంది



పెచ్చులూడుతున్న పైకప్పు, బీటలు వారిన గోడలు, దెబ్బతిన్న పిల్లర్లతో ఉన్న పోలీస్ స్టేషన్ భవనాన్ని చూస్తుంటే భయమేస్తోంది. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. స్టేషన్‌ను మరో ప్రాంతానికి తరలించేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి

- ఎం. హన్మంతరావు, చిలకలగూడ

కంటోన్మెంట్‌లో వరద సమస్యకు చెక్

త్వరలో నాలాల్లో పూడికతీత పనులు షురూ

సికింద్రాబాద్, మే 23 (ఆంధ్రజ్యోతి): వర్షాలు ప్రారంభం కావడంతో వరదనీటి సమస్యలకు చెక్ పెట్టాలని సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు యంత్రాంగం నిర్ణయించింది. కాలనీలు, బస్తీలు వరద నీటి ముంపునకు గురికాకుండా ఉండడానికి తీసుకోవలసిన చర్యలపై దృష్టి సారించింది. దీనిలో భాగంగా కంటోన్మెంట్ మీదుగా ప్రవహించే నాలాల్లో పూడికతీత పనులు చేపట్టేందుకు సన్నద్ధమైంది. ప్రధానమైన హస్మత్‌పేట్ నాలా, పికెట్ నాలాల్లో వ్యర్థాలను, పూడికను తొలగించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఇందుకు అవసరమైన యంత్ర సామగ్రిని సిద్ధం చేస్తున్నారు. గతంతో పోలిస్తే కొన్ని సంవత్సరాలుగా వర్షాకాలంలో కంటోన్మెంట్‌లోని కాలనీలు, బస్తీలు పెద్దగా వరదబారిన పడడం లేదని, నాలాల్లో మురుగునీరు సాఫీగా ప్రవహిస్తుండడమే అందుకు కారణమని అధికారులు చెబుతున్నారు. అయినప్పటికీ, వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని మరోసారి నాలాల్లో పూడికతీత పనులు చేపట్టాలని నిర్ణయించినట్టు పేర్కొంటున్నారు. హస్మత్‌పేట్ నాలా బోయినపల్లి హస్మత్‌పేట్ చెరువు నుంచి ప్రారంభమై బాపూజీనగర్, ఫిలిప్స్ గిడ్డంగి, ధనలక్ష్మి కాలనీ, తాడ్‌బండ్, అన్నానగర్, శ్రీలంకబస్తీ, ఇందిరమ్మనగర్, రసూల్‌పుర, ప్యాట్నీ కంపౌండ్ మీదుగా హుస్సేన్‌సాగర్‌లో కలుస్తుంది. పికెట్ నాలా పికెట్ నుంచి ప్రారంభమై పరేడ్‌గ్రౌండ్ మీదుగా హుస్సేన్‌సాగర్‌లో కలుస్తుంది. రామన్నకుంట చెరువు నుంచి వరద నీరు, మురుగునీరు సౌజన్య కాలనీ, తోకట్ట, రసూల్‌పుర మీదుగా ప్యాట్నీ కంపౌండ్ వద్ద హుస్సేన్‌సాగర్‌లో కలుస్తుంది. కాగా ఎగువన ఉన్న పాతబోయినపల్లిలో కాలనీలు, బస్తీల నుంచి వర్షపునీరు, మురుగునీరు రామన్నకుంట చెరువులో చేరడంతో చెరువు చుట్టుపక్కల ఉన్న శ్రీనివాస్‌నగర్, సాయిబాబా కాలనీ, సీతారాంపురం, దిగువ భాగాన ఉన్న సౌజన్య కాలనీ, పవన్‌విహార్ కాలనీ, ధనలక్ష్మి కాలనీ తదితర ప్రాంతాలు వరద ముంపునకు గురవుతుంటాయి.

అందుకే వర్షపునీరు ఎప్పటికప్పుడు సాఫీగా ప్రవహించేందుకు అధికారులు నాలాల్లో పూడికతీత పనులు చేపడుతుంటారు. నాలాల్లో పూడికతీత పనులకు సంబంధించిన కాంట్రాక్టు జూన్-జూలై వరకు ఉందని, టెండర్లు ఆహ్వానించవలసిన అవసరం లేకుండా తక్షణమే పనులు ప్రారంభించే వెసులుబాటు తమకు ఉందని సికింద్రాబాద్ కంటోన్మెంట్ శానిటరీ సూపరింటెండెంట్ దేవేందర్ తెలిపారు. కంటోన్మెంట్ ముఖ్య కార్యనిర్వహణాధికారి మధుకర్ నాయక్ ఆదేశాల మేరకు నాలాల్లో పూడికతీత పనులకు ప్రణాళికలు రూపొందించి, అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు ఆయన వెల్లడించారు.



రామన్నకుంట చెరువు పక్కనే కాలనీలో నిలిచిన వర్షపు నీరు(ఫైల్)



రామన్నకుంట చెరువు



నాలాల్లో పూడికతీత పనులు చేపట్టాలని కంటోన్మెంట్ ముఖ్య కార్యనిర్వహణాధికారికి వినతిపత్రం అందజేస్తున్న వాసవీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధి తేలుకుంట సతీష్‌గుప్తా

సోషియాలజీలో నూతన కోర్సులు

● సద్వినియోగం చేసుకోండి : నిజాం కళాశాల ప్రిన్సిపాల్

బర్కత్‌పుర, మే 23 (ఆంధ్రజ్యోతి): సోషియాలజీలో నూతనంగా ప్రవేశపెట్టిన కోర్సులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బీమా సూచించారు. గురువారం కళాశాలలో సోషియాలజీ కోర్సుల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సోషియాలజీలో కోర్సులను పూర్తిచేసిన విద్యార్థులు మెరుగైన ఉపాధి అవకాశాలు పొందవచ్చన్నారు. నిజాం కళాశాల సోషియాలజీ విభాగం ఇన్‌చార్జి హెడ్ డాక్టర్. డి. తిరుపతి మాట్లాడుతూ.. బీఏ సోషియాలజీలో (హెచ్ఎస్‌జీ, పీఎస్‌పీ, పీఎస్ఎం, ఎస్‌యూపీ) నాలుగు గ్రూప్‌లతో నూతన కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎంఏ సోషియాలజీలో పీజీ డిప్లొమా ఇన్ క్రిమినాలజీ అండ్ కరక్షనల్ అడ్మినిస్ట్రేషన్, పీజీ డిప్లొమా ఇన్ డెవలప్‌మెంట్ మేనేజ్‌మెంట్ అండ్ రీసెర్చ్ మెథడాలజీ, హ్యూమన్ రైట్స్ అండ్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కోర్సులను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచే విద్యార్థులు నూతన కోర్సులలో చేరవచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్. పి.మాలతి, డాక్టర్. సీహెచ్ పరంధాములు, స్టూడెంట్ అడ్వయిజర్ మహ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.



సోషియాలజీ కోర్సుల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బీమా తదితరులు

అధిక ధరలకు విక్రయిస్తున్న మందుల స్వాధీనం

హైదరాబాద్ సిటీ, మే 23 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరిలోని ఓ మెడికల్ దుకాణంపై ఔషధ నియంత్రణ సంస్థ అధికారులు దాడులు చేసి అధిక ధరలకు విక్రయిస్తున్న మందులను స్వాధీనం చేసుకున్నారు. బుధ, గురువారల్లో పలు ప్రాంతాల్లో అధికారులు దాడులు నిర్వహించారు. మల్కాజిగిరిలో ఓ మెడికల్ దుకాణంలో ఇట్రాకోన్ క్యాప్సూల్స్, ఇట్రాకోల్ క్యాప్సూవల్స్ అయింట్‌మెంట్‌ను అధిక ధరకు విక్రయిస్తున్నారు. సమాచారం అందుకున్న అధికారులు దాడి చేసి మందులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

సొంత ఐడీతో అధిక ధరకు రైల్వే టికెట్ల విక్రయం

● నిందితుడి అరెస్ట్

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, మే 23 (ఆంధ్రజ్యోతి): సొంత ఐడీతో అక్రమంగా అధిక ధరకు రైల్వే టికెట్లు విక్రయిస్తున్న ఓ వ్యక్తిని ఆర్పీఎఫ్ పోలీసులు అరెస్ట్ చేశారు. యూసుఫ్‌గూడ వెంకటగిరి ప్రాంతానికి చెందిన ముడావత్ శ్రీను సొంత ఐడీతో అధిక ధరకు రైల్వే టికెట్లు విక్రయిస్తున్నాడు. ఫిర్యాదు అందడంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. 26 మందికి రైల్వే టికెట్లు విక్రయించినట్లు అంగీకరించాడు. అతడి నుంచి రూ. 8,827 విలువగల 12 టికెట్లను స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా రైల్వే టికెట్లు విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్పీఎఫ్ నాంపల్లి ఇన్‌స్పెక్టర్ కల్పన హెచ్చరించారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

పోగొట్టుకున్న బ్యాగ్ ప్రయాణికురాలికి అప్పగింత

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, మే 23 (ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్‌లో పోయిన బ్యాగ్‌ను సీఆర్‌పీఎఫ్ పోలీసులు బాధితురాలికి అప్పగించారు. లింగంపల్లి రైల్వే స్టేషన్ ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ మనోజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన కుమారి సద్రోసి గురువారం లింగంపల్లి రైల్వే స్టేషన్‌కు వెళ్లింది. నర్సాపూర్ రైలు కోసం వేచి చూస్తుంది. కొద్ది సేపటి తర్వాత చూసుకోగా బ్యాగు కనిపించకపోవడంతో ఆర్పీఎఫ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ప్లాట్‌ఫాంపై గాలించి మరోచోట లభించిన బ్యాగ్‌ను ఆమెకు అప్పగించారు.



ప్రయాణికురాలికి బ్యాగ్ అప్పగిస్తున్న కానిస్టేబుల్ జితేష్ సరస్వత్

నత్తనడకన బాక్స్ డ్రెయిన్ పనులు

● మైత్రివనం వెనుక కొనసాగుతున్న వైనం



మైత్రివనం వెనుక ఉన్న నాలా

అమీర్‌పేట, మే 23 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేట మైత్రివనం వెనకాల ఉన్న నాలాలో రూ. కోటిన్నరతో నిర్మించతలపెట్టిన బాక్స్ డ్రెయిన్ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. వర్షం వచ్చిన ప్రతిసారి నాలా ఉప్పొంగి గాయత్రినగర్, గంగుబాయ్ బస్తీ బుద్ధనగర్‌లో ఇళ్లు, సెల్లార్లలోకి వరద నీరు చేరుతోంది. సమస్య పరిష్కారానికి ప్రభుత్వం రూ. 1.50 కోట్లు కేటాయించి టెండర్లు పిలిచింది. ఆన్‌లైన్‌లో టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ మార్చి మొదటి వారంలో పనులు ప్రారంభించి ఇప్పటి వరకు కేవలం నాలాలో పూడికను మాత్రమే తీశారు తప్ప బాక్స్ డ్రెయిన్ పనులు మాత్రం ప్రారంభించలేదు. దీంతో వర్షాకాలం ముంచుకొస్తున్న నేపథ్యంలో పలు బస్తీల వాసులు ఆందోళన చెందుతున్నారు. స్వర్ణ జయంతి కాంప్లెక్స్ నుంచి ఆస్టర్ ప్రైమ్ ఆస్పత్రి వరకు విశాలంగా ఉండే నాలాను కొంతమంది ఆక్రమించి ఇళ్లు, అపార్ట్‌మెంట్లను నిర్మించారు. భారీ వర్షం కురుస్తే శ్రీనివాసనగర్ (వెస్ట్)నుంచి భారీగా వచ్చే వరద నీరు వీధులు, కాలనీలు, బస్తీలను ముంచెత్తుతోంది. దీంతో వర్షాకాలంలో నాలా పరిసరాల్లో నివసిస్తున్న వారు ఇళ్లలోకి నీరు చేరడంతో అష్టకష్టాలు పడుతున్నారు.



గాయత్రినగర్‌లో ఓ అపార్ట్‌మెంట్ పక్కన వేసిన పూడిక

చిన్నపాటి వర్షానికే ఉప్పొంగుతున్న నాలా

స్వర్ణ జయంతి కాంప్లెక్స్ నుంచి లీలానగర్ వరకు ఉన్న ఒకటిన్నర కిలోమీటర్ నాలాలో పూడితీత పనులు కేవలం మైత్రివనం, గాయత్రినగర్ ప్రాంతాల్లో మాత్రమే చేపట్టారు పేరుకుపోయిన చెత్తా చెదారంవల్ల చిన్నపాటి వర్షానికే నాలా ఉప్పొంగుతోంది. ఇటీవల ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పనుల పురోగతిని పరిశీలించి అధికారులు, కాంట్రాక్టర్‌ను మందలించినా ఫలితం లేదు. ఉన్నతాధికారులు స్పందించి బిల్లులు చెల్లించి పనులను త్వరగా ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

వర్షం వస్తే రాత్రి జాగారమే



కొద్దిపాటి వర్షానికే నాలా పొంగి వీధుల్లోకి వరద నీరు చేరుతోంది. భారీ వర్షం కురిసిందంటే ఆ రోజు రాత్రంతా కంటిమీద కునుకు లేకుండా జాగారణ చేస్తున్నాం. ఈ సమస్య ప్రతి వర్షాకాలంలో ఉంటోంది. గత ఏడాది భారీ వర్షాలకు ద్విచక్రవాహనాలు నీటిలో మునిగి పాడైపోయాయి. నాలా మరమ్మతు పనులు వేగంగా పూర్తి చేయాలి.

- శ్రీనివాస్ ముదిరాజ్, డ్రైవర్, బుద్ధనగర్

ఇంట్లోకి నీరు చేరుతోంది



ప్రతి వర్షాకాలంలో నాలా ఉప్పొంగి వరద నీరు ఇళ్లల్లోకి చేరుతోంది. దీంతో సామగ్రి తడిసి పోతున్నాయి. గత సంవత్సరం కురిసిన వర్షాలకు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నాం.

- గోదారి లలితమ్మ, గంగుబాయ్ బస్తీ

వారం రోజుల్లో పనులు ప్రారంభం

మైత్రివనం వెనుకాల ఉన్న నాలాలో బాక్స్ డ్రెయిన్ పనులను వారం రోజుల్లో ప్రారంభిస్తాం. పూడికను తొలగించి జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు తరలిస్తున్నాం. ఇటీవల కురిసిన వర్షంవల్ల పనులు ఆగిపోయాయి. నిధుల లేమితో కాంట్రాక్టర్ పనులు చేసేందుకు వెనకాడుతున్నాడు. పనులను త్వరలో పూర్తి చేయిస్తాం.

- యెతేంద్రమోహన్, డీఈ, జీహెచ్ఎంసీ, అమీర్‌పేట

వ్యక్తి అదృశ్యం

అడ్డగుట్ట, మే 23 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి కనిపించకుండాపోయాడు. లాలాగూడ ఎస్‌ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. లాలాగూడ శాంతినగర్‌కు చెందిన మహ్మద్ సాదిక్(42) ప్రవేట్ ఉద్యోగి. ఈనెల 16న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతడి ఆచూకీ లభించకపోవడంతో భార్య తరుణం ఈనెల 23న పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



సాదిక్

భార్యతో గొడవలు.. అనారోగ్యం

జీవితంపై విరక్తితో ఓ వ్యక్తి బలవన్మరణం

అల్వాల్, మే 23 (ఆంధ్రజ్యోతి): దంపతుల మధ్య గొడవలు.. అనారోగ్యంతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. అల్వాల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇందిరానగర్ కానాజీగూడ ప్రాంతానికి చెందిన పల్లె ప్రమోద్‌కుమార్(40) తల్లితో కలిసి నివసిస్తున్నాడు. భార్య సౌజన్యతో కొన్ని సంవత్సరాలుగా మనస్పర్థల కారణంగా ఇద్దరి మధ్య తరుచుగా గొడవలు జరుగుతున్నాయి. దీంతో విడాకుల కోసం కోర్టును ఆశ్రయించారు. దీంతో ప్రమోద్‌కుమార్ మానసికంగా కుంగిపోయాడు. దానికి తోడు అనారోగ్యానికి గురవడంతో జీవితంపై విరక్తి చెందాడు. బుధవారం రాత్రి తల్లితో కలిసి భోజనం చేసి, తన రూమ్‌లోకి వెళ్లి నిద్రపోయాడు. గురువారం ఉదయం 7 గంటలకు నల్లా నీళ్లు పడదామని తల్లి ప్రమోద్‌కుమార్‌ను పిలవగా పలకలేదు. రూమ్‌లోకి వెళ్లి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకుని వేలాడుతూ ఉన్నాడు. ఆమె వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.